

బిల్లింగ్ పూర్తి చేయాలి : ఎస్ఇ

ప్రజాశక్తి-నెల్లూరు : వినియోగదారునికి ఇచ్చే విద్యుత్ బిల్లు ఐ.ఆర్.డి.ఎ. ద్వార స్కానింగ్ చేసి బిల్లు ఇవ్వాలని, మ్యానువల్ బిల్లింగ్ ఎక్కడ జరగకూడదని ఎస్ఈ వి.విజయన్ తెలిపారు. బుధవారం విద్యుత్ భవన్‌లోని తన ఛాంబర్ నుంచి జిల్లాలోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్స్‌తో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు స్కానింగ్ ద్వారా ఖచ్చితమైన రీడింగ్ తీసి బిల్లులను సకాలంలో ఇవ్వాలన్నారు. బిల్లింగ్ ప్రతి నెలా 7 వ తేదీ లోపలే పూర్తి చేయాలి,రేపు నెలలో 7వ తేదీ లోపల పూర్తి చేయాలన్నారు. సబ్ స్టేషన్ మెయింటనెన్స్ క్రమం తప్పకుండా ఖచ్చితంగా చేయాలన్నారు.బిల్ స్టాప్ సర్వీసులను తనిఖీ చేయాలని, అగ్రికల్చర్ సర్వీసులకు ఆధార్ నెంబరు మొబైల్ నెంబర్ లింక్ చేయాలన్నారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి అసిస్టెంట్ ఇంజనీర్స్ కల్పన, అనిల్,నరసింహారావు పాల్గొన్నారు.

విజయన్, ఎస్ఇ

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంలో

ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

కొనసాగుతున్న నిరవధిక సమ్మె - చిన్నారుల సంఘీభావం

ప్రజాశక్తి-నెల్లూరు

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సిఐటియు సీనియర్ నేత మాదాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కోరుతూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరవధిక దీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం 37వ రోజు నగరంలోని కలెక్టరేట్ ఎదుట జరుగుతున్న దీక్షల్లో అంగన్‌వాడీ కార్యకర్తల, హెల్పర్ల కుటుంబాలకు చెందిన చిన్నారులు పూలమాలలు వేసి సంఘీభావం తెలిపారు. 'జగన్ మామయ్య మా తల్లులు న్యాయమైన సమస్యలను పరిష్కరించండి' అంటూ నినదించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 37 రోజుల నుంచి అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నారన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. రాష్ట్రంలో లక్షా ఆరువేల మంది అంగన్‌వాడీలు, పండుగ జరుపుకోకుండా రోడ్లపై ఉన్నా ఈ ప్రభుత్వానికి మనసు కరగకపోవడం శోచనీయమన్నారు. అంగన్‌వాడీలపై నిర్ధయగా వ్యవహరిస్తున్న పాలకులు అంబానీ, అదానీల సేవలో తరిస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణతో సమానంగా ఏపిలోని అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, రిటైర్మెంట్ వయోపరిమితిని, ప్రమోషన్ వయోపరిమితిని పెంచాలని, మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా ప్రమోట్ చేయాలని, మినీ అంగన్‌వాడీ వర్కర్లుగా గుర్తించాలని, విధి నిర్వహణలో ఉంటూ మరణించిన వారికి రూ. 5 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సత్వరమే ప్రభుత్వం స్పందించి చర్చలు జరిపి వారి డిమాండ్లను పరిష్కరించాలన్నారు. సిఐటియూ జిల్లా కార్యదర్శి కె. అజయ్ కుమార్ , నగర అధ్యక్ష కార్యదర్శులు అత్తిమూరు శ్రీనివాసులు జి. నాగేశ్వరరావు రూరల్ అధ్యక్షులు కొండా ప్రసాద్ నాయకులు కత్తి శ్రీనివాసులు ,ఆర్. నగేష్ బత్తల కష్ణయ్య, పి సూర్యనారాయణ, అంగన్వాడి వర్కర్ యూనియన్ నాయకులు బి రజిని, సంపూర్ణమ్మ ,సుమతి, రత్నమ్మ ,వెంకట కుమారి, మలమ్మా ,రమాదేవి, కల్పన, ఉష పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు సీనియర్ నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, నాయకులు

ఉలవపాడు : తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగుతుందని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఉలవపాడు ప్రాజెక్టు అధ్యక్షులు సిహెచ్ ఇందిరావతి హెచ్చరించారు. అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలోఉలవపాడు ఐసిడిఎస్ ఆఫీస్ వద్ద జరుగుతున్న నిరవధిక ఆందోళన 37వ రోజు కొనసాగింది. ఎపి ఒగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఉలవపాడు ప్రాజెక్టు అధ్యక్షులు సి. హెచ్. ఇందిరావతి మాట్లాడారు. ఆందోళనలో ఉలవపాడు,గుడ్లూరు,లింగసముద్రం మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు. లింగసముద్రం మండల కార్యదర్శి బి.మార్తమ్మ, గుడ్లూరు మండల అధ్యక్షులు ఎస్.కే పద్మజ, వివిధ సెక్టార్ లీడర్లు సిహెచ్ పద్మ, డి రమాదేవి,పి. తిరుపతమ్మ, సిఐటియు నాయకులు కత్తి బుజ్జమ్మ,జె. వసంత, గీత, ప్రవీణ,శ్రీదేవి,రమణమ్మ ఉన్నారు.

ఉలవపాడులో..

పాటల సీడీని ఆవిష్కరిస్తున్న నాయకులు

జెవివి కళాజాతా

పాటల సీడీలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-నెల్లూరు

ఫిబ్రవరిలో జరిగే జెవివి రాష్ట్రస్థాయి కళాజాతాను పురస్కరించుకొని ఆధునిక రచయితలతో కొత్త పాటలు రాయించి ప్రజానాట్య మండలి రచయిత దేవేంద్ర సంగీత సారథ్యంలో, పర్యవేక్షణలో రికార్డు చేసిన సీడీలను బుధవారం జెవివి జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. జెవివి జిల్లా కల్చరల్ కమిటీ కన్వీనర్ ఎ.విజయ్‌కుమార్ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని కళాకారులందరూ హాజర య్యారు. జెవివి రాష్ట్ర నాయకులు డాక్టర్ కాలేషాబాషా, సాహితీ స్రవంతి పి.గోపినాథ్, జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, జెవివి జిల్లా అధ్యక్షులు ఉదయభాస్కర్, నగర ప్రధాన కార్యదర్శి డాక్టర్ శీను నాయక్, నగర గౌరవాధ్యక్షులు డాక్టర్ రఫీ, ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి గండవరపు శేషయ్య, జెవివి సమతావిభాగం విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గేయం ఆలపిస్తున్న జెవివి నాయకులు విజయ్‌కుమార్

ఓటరు తుది జాబితా ప్రచురణకు చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు : ఈనెల 22న ఓటరు తుది జాబితా ప్రచురణ చేయడానికి అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా రోల్ అబ్జర్వర్ పోలా భాస్కర్ అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో జిల్లాలో తుది ఓటర్ల జాబితా ప్రచురణకు సంసిద్ధత, జనాభా ఓటర్ల నిష్పత్తి, స్త్రీ పురుష ఓటర్లు తదితర అంశాలపై కలెక్టర్ ఎం హరి నారా యణన్, జిల్లాలోని ఇఆర్ఓలతో సమీక్షించారు. ఈ సందర్భంగా పోలా భాస్కర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు, జాబితా సవరణ అంశాలకు సంబంధించి రికార్డులు పక్కాగా నిర్వహించాలన్నారు. వారానికి ఒకసారి రాజకీయ పక్షాలతో సమావేశాలు నిర్వహించా లన్నారు. రాజకీయ పక్షాల నుండి గాని, వ్యక్తుల నుండి గాని, మీడియాలో గాని ఫిర్యాదులు వస్తే వాటిపై చర్య తీసుకుని ఫిర్యాదు దారులకు సమాచారం ఇవ్వాలన్నారు. తుది ఓటర్ల జాబితా ప్రచురితం అయిన తర్వాత రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితా ఇవ్వాలన్నారు.

సమీక్షిస్తున్న అబ్జర్వర్ పోలా భాస్కర్, కలెక్టర్ ఎం హరినారాయణన్

కలెక్టర్ హరి నారాయణన్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలుగా వినియోగించనున్న పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో మౌలిక వసతులైన తాగునీరు ,టాయిలెట్లు , విద్యుత్ ,ఫ్యాన్లు, లైట్లు తదితర సౌకర్యాలు ఈనెల 25 లోగా పూర్తి చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, డిఆర్వో ఎస్.లవన్న, ఈఆర్వోలు విద్యాధరి, మలోల, శీనా నాయక్, మధులత, బాపురెడ్డి, ఓబులేసు, ప్రేమ్ కుమార్ కలెక్టరేట్ ఎలక్షన్ తహశీల్దార్లు, డిటిలు పాల్గొన్నారు.

పటిష్టంగా కులగణన : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు : ఈ నెల 19 నుంచి 28 వరకు జరిగే కులగణన పకడ్బంధీగా నిర్వహించాలని కలెక్టర్ ఎం హరి నారాయణన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కులగణన జన్ భగీదరి, స్వతంత్ర దినోత్సవ వేడుకలు, అంగన్వాడీల సమ్మె తదితర అంశాలపై కలెక్టర్ సంభందిత అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కులగణన సున్నితమైన అంశమని ,చేపట్టేటప్పుడు సిబ్బంది జ ప్రజలతో జాగ్రత్తగా, మర్యాదగా వ్యవహరిం చాలన్నారు. ప్రతి సచివాలయంలో కులగణన చేసే సిబ్బంది ఇంటింటికి తిరిగి ఈ కేవైసీ సేకరిం చాలన్నారు. కులగణన పై గతంలో శిక్షణా కార్యక్రమాలు ఇవ్వడం జరిగిందని, అయినప్పటికీ గురువారం మరొకసారి శిక్షణ ఇవ్వాలని జెడ్పి సిఇఒకు కలెక్టర్ సూచించారు. ఈనెల 19న విజయవాడలో జరిగే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సామాజిక మహా శిల్పం ఆవిష్కరణ కార్యక్రమానికి జిల్లా నుండి సుమారు 5000 మంది హాజరవు తున్నందున వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హరి నారాయణన్ పిడి డిఆర్డిఎ కు సూచించారు. జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మానాథ్ డిఆర్ఓ ఎస్ .లవన్న, సీఈఓ చిరంజీవి, పిడి డిఆర్డిఏ సాంబశివారెడ్డి, పి డి ఐ సి డి ఎస్ హేన సుజన్ ఉన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

'మెడికవర్'లో

బోన్ మారో ట్రాన్స్ ప్లాంటేషన్' చికిత్సలు

ప్రజాశక్తి-నెల్లూరు : మహానగరాలలో మాత్రమే ఉండే బోన్ మారో ట్రాన్స్ ప్లాంటేషన్ వైద్య చికిత్సలు నగరంలోని మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో అందుబాటులో ఉన్నాయని ఈ తరహా చికిత్సలు తమ వైద్యశాలలో విజయవంతంగా నిర్వహి స్తున్నట్లు ఆ ఇన్‌స్టిట్యూట్ సెంటర్ హెడ్ డాక్టర్ బిందురెడ్డి తెలిపారు. బుధవారం మెడికవర్ వైద్యశాలలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ తమ వైద్యశాలలో గత ఏడాది ' బోన్ మారో ట్రాన్స్ ప్లాంటేషన్' ద్వారా విజయవంతంగా రోగికి చికిత్సలు నిర్వహించామన్నారు. అటువంటి చికిత్సలు మరో బాధితురాలికి అందజేసి ప్రాణాపాయం నుంచి తప్పిం చామన్నారు. ప్రప్రధమంగా నవంబరు నెలలో బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌చికిత్సలు విజయవంతంగా పూర్తి చేశామన్నారు. మెడికోవర్ క్యాన్సర్ ఆసుపత్రి వైద్యులు మెడికల్ ఆం కాలజిస్ట్ డాక్టర్ రంగరామన్ రెండో మార్పిడి కేసును డిసెంబరు నెలలో విజయ వంతంగా పూర్తిచేశారన్నారు. కర్నూలు జిల్లా కు చెందిన గోవిందమ్మ అనే మహిళ వేరొక కేన్కసర్ ఆస్పత్రిలో మైలోమా (బోన్ క్యాన్సర్) కి చికిత్స తీసుకుందన్నారు. మెరుగైన చికిత్స కోసం తమ ఆస్పత్రికి వచ్చారన్నారు. వైద్య నిపుణులు మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రంగరామన్ పరీక్షలు చేసి బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయటం వల్ల జబ్బు పూర్తిగా నయం అవు తుందని, వారి కుటుంబ సభ్యులకు వివరించారన్నారు. బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంటేషన్ ట్రీట్‌మెంట్‌కు దాదాపుగా రూ.8 - 10 లక్షల వారికి ఖర్చవుతుందన్నారు. వారి అర్థిక పరి స్థితులను అర్థం చేసుకున్న ఆసుపత్రి యాజమాన్యం, డాక్టర్లు ,ఈ వైద్య చికిత్సని పూర్తి ఆరోగ్య శ్రీలో చేర్చి చికిత్సలు నిర్వహించామన్నారు. మెడికవర్ క్యాన్సర్ ఇన్సిట్యూట్ సెంటర్ హెడ్ డాక్టర్ బిందు రెడ్డి మాట్లాడుతూ బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్స అవసరం అయిన రోగులకు దూరప్రాంతాలకి వెళ్లి ఇబ్బందులు పడకుండా అత్యా ధునిక వైద్య సౌక ర్యాలు కలిగిన మెడికోవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ లో అందుబాటులో ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమ క్యాన్సర్ ఇన్సిట్యూట్ అందిస్తున్న వైద్య సేవలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మాట్లాడుతున్న డాక్టర్ బిందురెడ్డి

అధికారులకు శిక్షణ

ప్రజాశక్తి-ఉలవపాడు : ఉలవపాడులో స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాల యంలో బుధవారం జిపిడిపిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ ఎన్. విజయ, ఇఒపిఆర్‌డి ఎల్ చెంచమ్మ పాల్గొని మాట్లాడారు. మండల స్థాయి, అధికారులు ఎంపిటిసిలు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

నేడు తైక్వాండో పోటీలకు ఎంపికలు

ప్రజాశక్తి-కందుకూరు : జిల్లా స్థాయి సబ్ జూనియర్ తైక్వాండో బాల, బాలికల పోటీలకు ఈనెల 18 వ తేదీన కందుకూరులోని టిఆర్ఆర్ కాలేజీ గ్రౌండ్ ఆవరణంలో ఎంపికలు నిర్వహి స్తున్నట్లు రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ మాస్టర్ ఎస్కే అబ్దుల్ సలాం, జిల్లా కార్యదర్శి పి. అఖిల్ తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు నేడు 9 గంటల లోపు హాజరు కావాలన్నారు. ఎంపికైనవారు ఈనెల 20,21 తేదీల్లో నంద్యాలలో రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు :9494946207 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

'సుప్రీం' తీర్పు బాబుకు చెంప పెట్టు

అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసుకు సంబంధించి సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడికి చెంపపెట్టులాంటిదని ప్రభుత్వ అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన నగరంలో విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబు అరెస్టు విషయంలో ప్రభుత్వం చంద్రబాబుపై కక్ష సాధింపు చర్యలు అనే ఆరోపణలు చేయడం దారుణమన్నారు.. టిడిపి నాయకులు అనవసరంగా మీడియాలో డిబేట్‌లు పెట్టి మరి మహిళా న్యాయ మూర్తి అని కూడా చూడకుండా అన్యాయంగా తప్పుడు మాటలు మాట్లాడారని గుర్తు చేశారు. చంద్రబాబు వ్యవస్థలను మేనేజ్ చేస్తాడనే పేరు ఉందన్నారు. చట్టం ప్రకారం పనిచేస్తున్న న్యాయవ్యవస్థలుపై అభ్యంతరకరమైన వాఖ్యలు చేయడం దారుణమన్నారు. కేసు మొదలైన నాటి నుంచి చంద్ర బాబు తరఫున వాదించే వారు కోర్టులో తాము రూ. 371 కోట్లు స్కాం చేయలేదని వాదించలేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడి పట్ల ఈ ప్రభుత్వం ఎంతో గౌరవమర్యాదలతో వ్యవహరించిందన్నారు. భద్రత కారణాల రీత్యా చంద్రబాబును రోడ్డు మార్గం లో ఆయన కోరుకున్న విధంగా ఆయన కాన్వాయ్‌లో అత్యంత భద్రత నడుమ జైలుకు తరలిం చామన్నారు. జైలులోనూ అనేక సౌకర్యాలు కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. చట్టం ముందు అందరూ సమానమేనన్నారు. మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ కానీ అప్పట్లో మహాత్మా గాంధీ జైల్లో ఉన్నారని, వారందరూ చంద్రబాబు నాయుడు పొందిన సౌకర్యాలు పొందలేదని తెలిపారు.

మాట్లాడుతున్న పొన్నవోలు సుధాకర్‌రెడ్డి

అంబేద్కర్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయండి : వైసిపి

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-కందుకూరు : విజయవాడలో ఈనెల 19న సిఎం జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా జరిగే అంబేద్కర్ విగ్రహావిష్కరణ, స్మృతి వనం ప్రారంభోత్సవ కార్యక్రమాలకు ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని కందుకూరు పట్టణ వైసిపి అధ్యక్షులు ఎస్‌కె రఫీ, జె సి ఎస్ కో ఆర్డినేటర్ ముప్పవరపు కిషోర్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎంఎల్‌శ్రీ మానుగుంట మహీధర్ రెడ్డి ఆధ్వర్యంలో కందుకూరు నియోజకవర్గం నుంచి 30 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సామాజిక న్యాయ సంకల్ప సభకు వచ్చే వారు తమ పరిధిలోని సచివాలయాల్లో ఈ రోజు నుంచి 18 వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించార. 19 వ తేదీన ఉదయం 8 గంటలకు బస్సులు బయలుదేరు తాయన్నారు. ఉలవపాడు మండల అధ్యక్షులు నన్నం పోతురాజు, జేసిఎస్ కోఆర్డినేటర్ ధనకోటి, వలేటివారిపాలెం మండల జేసిఎస్ కోఆర్డినేటర్ అనుమోలు వెంకటేశ్వర్లు, గుడ్లూరు జెడ్‌పిటిసి కె బాపిరెడ్డి , నాయకులు నగళ్ల నారయ్య, బికారి పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనకు బాధ్యులు నియామకం

సామాజిక సమతా సంకల్పం సభకు కందుకూరు మున్సిపాలిటీ సచివాలయం నుంచి హాజరయ్యే వారికి అవసరమైన రవాణా సౌకర్యాలు భోజన వసతి ఏర్పాట్లు చేయడం కోసం మున్సిపాలిటీ నుంచి, సచివాలయం నుంచి బాధ్యులను నియమించారు. ఈ మేరకు బుధవారం మున్సిపాలిటీ కమిషనర్ మనోహర్, మేనేజర్ చంద్రమోహన్ సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లడుతూ విజయవాడ స్వరాజ్ మైదానంలో సిఎం జగన్మోహన్ రెడ్డి చేతులు మీదుగా సామాజిక న్యాయ మహా శిల్పం ఆవిష్కరణ జరగనున్న సందర్భంగా కందుకూరు మున్సిపాలిటీ పరిధిలో ఆరు బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆది ఆంధ్ర కాలనీ, శ్రీనగర్ కాలనీ, బందావనం, ఉప్పు చెరువు, ప్రశాంతి కాలనీ, దూబగుంట నాంచారమ్మ కాలనీ, ప్రాంతాల్లో బస్సులను ఏర్పాటు చేశామన్నారు. 19వ తేదీన ఉదయం 8 గంటలకు బయలుదేరుతాయన్నారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్లు కార్తిక్, రమేష్ బాబు, జె సి యస్ కో ఆర్డినేటర్ ముప్పవరపు కిషోర్, పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ,ఎ.ఎమ్.సి మాజీ అధ్యక్షుడు గేరాచిరంజీవి, యువజన విభాగం జిల్లా కార్యదర్శి షేక్ మహ బూబ్, యస్ సి సెల్ జిల్లా సెక్రటరీ యరమాల నాగభూషణం, సచివాలయం కన్వీనర్లు షేక్ రహీం, సచివాలయం అడ్మిన్ సెక్రటరీలు రాంబాబు, అమరేశ్వర రెడ్డి, సుబ్బారావు, జ్యోతి ఉన్నారు.

సమావేశంలో పాల్గొన్న నాయకులు

సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణంలోని కొత్తపాలెం 14వ వార్డు కష్ణ బలిజ సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సంబరాల సందర్భంగా నిర్వహించిన పలు పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి బుధవారం బహుమతులను అందజేశారు. ఈ వేడుకలలో పాల్గొన్న కష్ణ బలిజ సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ గత మూడు రోజుల నుంచి సంక్రాంతి సందర్భంగా మహిళలచే కోలాటం, ముగ్గుల పోటీలు, చిన్నారులచే ఆట పాటలను కందుకూరు కష్ణ బలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించ్నిట్లు తెలిపారు. జిల్లాలో కష్ణ బలిజ సంఘం వారు అనేక సమస్యలుఎదుర్కొంటున్నారని వాటిని పరిష్కరించే దిశగా అడుగులు వేయటం జరుగుతుందన్నారు. అనంతరం పోటీల్లో గెలిచిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. బహుమతుల ప్రధానానికి సభాధ్యక్షులుగా కష్ణ బలిజ సంఘం సంఘం నెల్లూరు జిల్లా యువజన విభాగం ఇంచార్జ్ యర్రంశెట్టి ఆనందమోహన్ వ్యవహరించారు. విజేతలకు డాక్టర్ ధర్మ తేజ బహుమతులను స్పాన్సర్ చేశారు. ముఖ్య అతిథులను సత్కరించారు. రెడ్డి హాస్పిటల్ అధినేత డాక్టర్ మల్లికార్జున, కష్ణ బలిజ సంఘం రాష్ట్ర కార్యదర్శి శివరామకష్ణ, కష్ణ బలిజ సంఘం జిల్లా డైరెక్టర్ పాశం కుమారి కొండయ్య, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ దుర్గా హరి ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు పసుపులేటి రమణయ్య, నాయుడు హరిప్రసాద్, శ్రీహరి, సమరం, జిల్లా కోశాధికారి రమణయ్య పాల్గొన్నారు.

మహిళలను సన్మానిస్తున్న దృశ్యం

డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణంలోని రజక పాలెంలోని రామాలయం దగ్గర జిల్లా రజక విద్యా సేవా సంఘం ఆధ్వర్యంలో సంఘ డైరీని రిటైర్డ్ ఎంపిడి కె మాలకొండయ్య బుధవారం ఆవిష్కరించారు. మాలకొండయ్య మాట్లాడుతూ గత నాలుగేళ్ల నుంచి పది చదువుతూ మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ఈ సేవా సంఘం తరఫున ప్రతి విద్యార్థికి రూ. 5000 నగదు బహుమతిని జిల్లా కేంద్రంలో అంది స్తున్నట్లు తెలిపారు. వారిని ముందుకు తీసుకెళ్లే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం చేపడు తున్నామ న్నారు. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థులు వివరాలు పంపాలని సూచించారు. ఆ సేవా సంఘం గ్రూపు అడ్మిన్ కల్లగుంట మోహన్ రావు (బి టి ఏ రాష్ట్ర కార్యదర్శి) మాట్లాడుతూ ఈ సంఘం తరఫున ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు చదువుకోవాలని కోరిక ఉండి చదువు మానేసిన వారు తమ సంఘాన్ని సంప్రదించాలని సూచించాచరు. కె ఎలమంద, కెవై కోటయ్య, కె వెంకటేశ్వర్లు, మంచికెళ్లపాటు వెంకటేశ్వర్లు ,కె రవి, కె మాలకొండయ్య, పి బ్రహ్మయ్య, జూనియర్ అధ్యాపకులు బొప్పరాజు వెంకట కాశి రత్నం ఉన్నారు.

డైరీ ఆవిష్కరిస్తున్న దృశ్యం

మామిడి పూత ఆలస్యం..

వాతావరణంలో మార్పులే కారణం - ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-ఉలవపాడు : ఉలవపాడు పరిధిలోని మామిడి తోటల్లో పూత ఆలస్యంగా పూస్తోంది. ఈ ఏడాది మామిడి పూతలు ముందే పూస్తున్నాయని రైతులు అనుకునేసరికి రైతుల ఆశలు అడియాసలయ్యాయి. తుఫాను, భారీ వర్షాలు, వాతావరణం మార్పుల వల్ల ముందే పూసిన పూత కాస్త మాడిపోయింది. సాధారణంగా అక్టోబర్ నెలలో మామిడి పూతల సీజన్ ప్రారంభమవుతుంది. డిసెంబర్ నాటికి తోటల్లో పూత పిందె దశలో కనపడాలి. ఈ ఏడాది జనవరి నెల సగానికి పైగా పూర్తయినా తోటల్లో పూతలు కనపడటంలేదు. దీనికి వాతావరణంలో వచ్చిన మార్పులే కారణమని రైతులు చెబుతున్నారు. ఫలితంగా తోటల్లో చెట్లు మొండిగాదర్శన మిస్తున్నాయి. వాతావరణంలో ప్రతికూల కారణంగా ఈ సీజన్లో మామిడి తోటలకు ఇప్పటికీ పూత లేదు. చల్లని వాతావరణం మంచు కురుస్తుండడంతో తోటల్లో పూత వచ్చే అవకాశాలు కనబడటం లేదు. డిసెంబర్ లోనే పిందెలు పట్టాల్సిన తోటలు ఇంకా పూతకు రాకపోవడంతో కౌలు రైతులు ఆందోళన చెందుత న్నారు. ముం దుగా కొనుగోలు చేసిన మామిడి కౌలు రైతులు రకరకాల మందులతో పిచికారి చేస్తూ భగీరథ యత్నం చేస్తున్నారు. గత ఏడాది ఇదే రోజుల్లో మామిడి తోటల్లో రైతులు పోటీపడి నాలుగు, ఐదు, ఆరు దపాలుగా మందులు పిచికారి చేశారు. ప్రస్తుతం అదే బాటలో మందులు పిచికారి చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో అక్కడక్కడ పూతలు ప్రారంభమైనట్లు రైతులు పేర్కొన్నారు.ఏది ఏమైనా ఏడాది మామిడి తోటల పరిస్థితి ఆశాజనంగాఉండే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు.

మామిడి తోట

భూ పంపిణీలో భారీ దోపిడీ : సోమిరెడ్డి

తహశీల్దార్ కార్యాలయంలో వాగ్వాదం

ప్రజాశక్తి -పొదలకూరు

సర్వేపల్లి నియోజకవర్గంలో పేదల భూ పంపిణీ పేరుతో మంత్రి కాకాణి భారీ దోపిడీకి పాల్పడుతున్నారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆరోపించారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ వీర వసంతరావుతో మండలంలోని భూ పంపిణీ కార్యక్రమంలో జరుగుతున్న పలు అవకతవకలు, అక్రమాలపై నిలదీశారు. వారి మధ్య కొద్ది సేపు మాటల యుద్ధం నడిచింది. అనంతరం సోమిరెడ్డి తహసీల్దారు కార్యాలయం ఎదుట మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి గ్రామసభలు నిర్వహించకుండా, మేత, కొండ,వాగు పోరంబోకు భూములకు ఎలా పట్టాలు ఇస్తారని ప్రశ్నించారు. తన దగ్గర ఉన్నది ఫేక్ లిస్ట్ అయితే, ఒరిజినల్ లిస్ట్ ఏదో బయట పెట్టాలని తహశీల్దార్‌ను అడిగారు. మండలంలోని ఎర్రబల్లి, బత్తులపల్లి, దుగ్గుంట, ఊచపల్లి ,ఊట్లపాలెం, వావింటపర్తి గ్రామాల్లో సుమారు 516 ఎకరాలు మేత,కొండ పోరంబోకు భూములను వైసిపి నేతలు, కార్యకర్తలకు ఇష్టానుసారం ఎలా ఇస్తారని మండిపడ్డారు. ' మీ ఆఫీసులో కంప్యూటర్ ఆపరేటర్‌గా వున్న బత్తులపల్లి విఆర్ఎ తన కుటుంబ సభ్యులు పేరుతో 14 ఎకరాలు ఎలా తీసుకుంటారన్నారు. మండలంలోని వరదాపురంలో సుమారు భారత్,రుస్తుం మైన్లలో 70 ఎకరాల్లో ఎటువంటి లీజు లేకుండా క్వారీలో అక్రమ మైనింగ్ జరుగుతుంటే, కోట్ల రూపాయల దోపిడీ జరిగితే, లీజు లేని సమయంలో అది ప్రభుత్వ భూమి అవుతుందని తహశీల్దారుకు ఆ ప్రభుత్వ భూమిని రక్షించాల్సిన బాధ్యత లేదా అని ప్రశ్నించారు. ఇదే కార్యాలయంలో అవినీతికి పాల్పడిన తహశ్శల్దార్ స్వాతి, తహసీల్దారు ప్రసాద్ సస్పెండ్ అయ్యారని అదే గతి ప్రస్తుత తహశీల్దార్ వీర వసంతరావుకు పడుతుందని హెచ్చరించారు. సజ్జల రామకష్ణతో కలిసి, మంత్రి కాకాణి కష్ణపట్నం వెళ్లే కొత్త నాలుగు లైన్ల రోడ్డు సమీపంలో వందల ఎకరాలు కొనుగోలు చేస్తున్నారన్నారు. వీటన్నింటిపై సమగ్ర విచారణకు డిమాండ్ చేశారు. ఆయన వెంట టిడిపి తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నరసింహ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర , రాజంపేట మండల అధ్యక్షులు సుబ్బనరసయ్య ,పొదలకూరు మండల అధ్యక్షులు తలచీరు మస్తాన్ బాబు, బొద్దులూరి మల్లికార్జున్ నాయుడు, సీనియర్ నాయకులు పులిపాటి వెంకటరత్నం నాయుడు, బక్కయ్య నాయుడు ,అక్కెం సుధాకర్ రెడ్డి, కోడూరు పెంచల భాస్కర్ రెడ్డి, నెట్టెం.పెంచలయ్య, పల్లారపు.కష్ణ. మద్దిరెళ్ళ.నరసింహులు, వి.రాజశేఖర్ రెడ్డి, అలుపూరు శ్రీనివాసులు ఉన్నారు.

తహశీల్దార్‌ను నిలదీస్తున్న మాజీ మంత్రి సోమిరెడ్డి

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరవధిక సమ్మె

మాట్లాడుతున్న డాక్టర్ బెజవాడ రవికుమార్

ప్రజాశక్తి-కావలి రూరల్ : రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీలు చేపట్టిన రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మె 37వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు జగనన్నకు చెబుదాం అని కోటి సంతకాల కార్యక్రమాన్ని బుధవారం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన అంగన్‌వాడీల శిబిరం వద్ద డాక్టర్ బెజవాడ రవికుమార్ తొలి సంతకం చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల పోరాటం భావితరాలకు దిక్సూచి అని, ఈ పోరాటం జరగబోయే పోరాటాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. 37రోజులు ఐక్యంగా పోరాటం చేయడం చాలా గొప్ప విషయమన్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు డిమాండ్లను పరిష్కరించకపోవడం చాలా బాధాకరమని, అంగన్‌వాడీలు అడిగేవి ప్రభుత్వం పరిష్కరించలేనంత ఏమీలేవని న్యాయమైన డిమాండ్లే అని తెలియజేశారు. పోరాటంలో వెనకడుగు వేయకుండా సాధించేంత వరకు పోరాటాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీల పోరాటానికి అండ ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ శిబిరానికి ముఖ్యఅతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మోహన్ రావు హాజరై మాట్లాడుతూ 37 రోజులుగా పోరాటం చేస్తున్నామని ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేసినందున, ఉద్యమం మరింత బలపడిందని సమ్మెకు కారణం ప్రభుత్వమేనని ముందుగానే అనేకసార్లు అంగన్‌వాడీ డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరామని ప్రభుత్వం స్పందించకుండా ఉన్నందునే సమ్మె నోటీసు ముందుగానే ఇచ్చామని సమ్మెలోకి వెళతామని ప్రభుత్వానికి తెలియజేశామన్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో సమ్మె చేయాల్సి వచ్చిందని సమ్మె చట్టబద్ధమైందని ప్రభుత్వం డిమాండ్లను పరిష్కరించకుండా అంగన్‌వాడీలపై ప్రభుత్వం రకరకాలుగా బెదిరింపులకు పాల్పడుతుందని తెలిపారు. ఎస్మా ఉపయోగించి పోరాటాలు అణిచివేయాలని చూస్తుందని, ఉద్యోగాలు తీసేస్తామని, నోటీసులు ఇస్తుందని మరోక పక్క అధికారులు అధికార పార్టీ నాయకులతో ఒత్తిడి తెస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇన్ని రకాలుగా అంగన్‌వాడీ హెల్పర్లను ఇబ్బందులకు గురి చేస్తుందని తెలిపారు. తమిళనాడు ముఖ్యమంత్రి గతంలో జయలలిత ఉన్నప్పుడు ఇలాగే కలంపోటుతో ఉద్యోగాలు పీకేయడంతో తరువాత ఎన్నికలలో అక్కడ ప్రజలు అధికారం నుండి ఆమెను ఇంటికి పంపారని కోర్టుకు వెళ్లి అందరూ ఉద్యోగాలు తెచ్చుకున్న చరిత్ర ఉందని, అంగన్‌వాడీలను చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గుర్రాలతో తొక్కించినందున ఆయన కూడా అధికారానికి దూరమై పోయాడని, చరిత్రను ఒకసారి ముఖ్యమంత్రి తెలుసుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వం ఇప్పటికైనా అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. అంగన్‌వాడీలకు సిపిఎం, సిఐటియు అండగా ఉంటుందని, పరిష్కరించకుండా బెదిరింపులకు పాల్పడితే ఈ ప్రభుత్వం కూడా తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పసుపులేటి పెంచలయ్య, టి.మాల్యాద్రి, వై.కృష్ణమోహన్, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఎం.రమాదేవి, బి.శ్రీదేవి, జెవివి నాయకులు పి.జానకిరామ్, హరినారపరెడ్డి, మాజీ ఎంఇఒ కల్లయ్య, సిపిఎం నాయకులు జి మధుసూదన్ రావు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు రఘురావమ్మ, విజయలత, వజ్రమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : అంగన్‌వాడీల సమ్మె 37వ రోజు అనంతసాగరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ వద్ద విజయవంతంగా జరుగుతుంది. బుధవారం కోటి సంతకాల సేకరణలో భాగంగా ప్రతీసెంటర్లో సంతకాలు సేకరించే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య, సిఐటియు మండల కార్యదర్శి, అనంతసాగరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు విరాళం అందజేస్తున్న టిడిపి నాయకులు

అంగన్‌వాడీలకు టిడిపి విరాళం

ప్రజాశక్తి-వరికుంటపాడు : గత 36రోజులుగా సమ్మెలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు టిడిపి ఆధ్వర్యంలో బుధవారం రూ.20వేలు విరాళం అందజేశారు. వరికుంటపాడు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడుతున్న అంగన్‌వాడీలకు తెలుగుదేశం పార్టీ నాయకులు మద్దతు ప్రకటించి వారితో పాటు శిబిరంలో కూర్చున్నారు. నిరంతరాయంగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు ఖర్చుల నిమిత్తం సాయం అందించాల్సిందిగా మాజీ ఎంఎల్ఎ బొల్లినేని వెంకట రామారావు ఆదేశాల మేరకు వారికి ఈ నగదు అందజేసినట్లు మండల టిడిపి నాయకులు తెలిపారు. ప్రభుత్వం మొండి పట్టుదల వీడి అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్‌లను అంగీకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. లేదంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మధుసూదన్ రావు, మాజీ మండల కన్వీనర్ చంద్ర వెంకన్న, టిడిపి సీనియర్ నాయకులు చంద్ర ఉమామహేశ్వరరావు, పాలకొల్లు భాస్కర్ రెడ్డి, ముజ్జే లక్ష్మీనారాయణ, శ్రీకాంత్, కొనిగిపోగు వెంగయ్య, కాలే వెంకట్రావు, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు రజియా, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను కొనసాగిస్తాం అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-ఉదయగిరి : అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టే సమ్మెను కొనసాగిస్తామని అంగన్‌వాడీలు తేల్చి చెప్పారు. బుధవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సిఐటియు ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి ఈ సందర్భంగా అంగన్‌వాడీ నాయకురాలు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం పాదయాత్రలో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మొండివైఖరితో సమ్మెకు భంగం కలిగించేందుకు నోటీసులు పంపించడం బాధాకరమన్నారు. వెంటనే వైసిపి ప్రభుత్వం మండువైఖరి వీడి అంగన్‌వాడీకి ఇచ్చిన హామీలను నెరవేర్చి అంగన్‌వాడీలకు అండగా నిలవాలన్నారు. లేనిపక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఫర్దిన్ బాషా, సిఐటియు నాయకులు కాకు వెంకటయ్య, ఖాజా మొహిద్దీన్, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రమీల, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని గత 33 రోజుల నుండి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు నిరవధిక సమ్మె చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు యూనియన్ల ఆధ్వర్యంలో చర్చలు జరిపి విఫలమయ్యారు. అంగన్‌వాడీల కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు కానీ రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకపోవడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెను కొనసాగిస్తున్నారు. తమ డిమాండ్ల పరిష్కారమయ్యే వరకూ తమ సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి పి రాధమ్మ, అంగన్‌వాడీ సెక్టార్ లీడర్లు రమణమ్మ, కామేశ్వరి, జమీల, శ్రీదేవి, మస్తానమ్మ, విజయమ్మ, విజయలక్ష్మి, మస్తానమ్మ, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లేక అవస్థలు

- కెవిపిఎస్ జిల్లా నాయకులు ఆత్మకూరు నాగయ్య

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : గత 36రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెలో ఉండటం వల్ల అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడడంతో చిన్నారులకు సంరక్షణ లేక పోషకలోపం ఏర్పడి ఇబ్బంది పడుతున్నారని ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో చిన్నారుల గర్భిణుల పరిస్థితి దారుణంగా తయారైందని వెంటనే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించి అంగన్‌వాడీ కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ జిల్లా నాయకులు ఆత్మకూరు నాగయ్య కోరారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించి అక్కడ గిరిజన కుటుంబాలతో మాట్లాడారు. ఉదయాన్నే అంగన్‌వాడీ కేంద్రంలో తమ పిల్లలను వదిలి పనికి వెళ్లి మధ్యాహ్నం వచ్చేంత వరకూ పిల్లలకు మంచి ఆహారం అందిస్తూ రక్షణగా ఉండేవరని ప్రస్తుతం అంగన్‌వాడీ వర్కర్లు సమ్మెలో ఉండటం వల్ల తమ కేంద్రానికి పిల్లలను పంపడానికి లేక పిల్లలను వదిలి తమ పనులకు పోలేక ఇళ్ల వద్దని ఉండవలసి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే కలగజేసుకొని అంగన్‌వాడీ కేంద్రాలలో పూర్తిస్థాయిలో తెరిచి తమ బిడ్డలకు పోషకాహారం అందించడంతోపాటు సంరక్షణ కల్పించవలసిందిగా గిరిజనలు ఆవేదనతో కోరినట్లు నాగయ్య తెలిపారు. ప్రభుత్వం వెంటనే అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం చేపట్టి అంగన్‌వాడీ కేంద్రాలలో ఆయాలను టీచర్లను యథావిధిగా ఉండేలా చర్యలు చేపట్టాలని లేకుంటే గిరిజన కుటుంబాలు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని, దానిపై తాము కెవిపిఎస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వం వెంటనే అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించి కేంద్రాలను తెరిచి తమ బిడ్డలను గర్భిణులను ఆదుకోవాలని కోరుతున్నామన్నారు.

మహిళల సాధికారతే లక్ష్యం

ప్రజాశక్తి-కావలి : మీకోసం స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో నేషనల్ యూత్ వీక్ సందర్భంగా నెహ్రూ యువ కేంద్ర నెల్లూరు వారి సహకారంతో ముసునూరు ఇందిరమ్మ కాలనీలో నివసిస్తున్న మహిళలకు టైలరింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర జిల్లా యూత్ అధికారి డాక్టర్ ఎ.మహేంద్ర రెడ్డి మాట్లాడుతూ మహిళలు స్వయంశక్తితో ఎదగాలని స్వయం ఉపాధిలో అనేక ఉన్నాయని, వాటిలో ఏదో ఒకటి ఎన్నుకొని వివిధ స్వచ్ఛంద సంస్థల ద్వారా ఇచ్చే ఉచిత శిక్షణలో పాల్గొని నైపుణ్యం సాధించి సొంతంగా ఆర్థిక పరిపుష్టి పొందాలని కోరారు. పూర్ పీపుల్ వాలంటరీ ఆర్గనైజేషన్ చేవూరి చిన్న మాట్లాడుతూ మహిళలు స్వయం శక్తిగా ఎదగాలంటే టైలరింగ్ లాంటి వృత్తి శిక్షణ చేసి తద్వారా ఆర్థికంగా ఎదగాలని ఒకరిపై ఆధారపడకుండా వారు ఆత్మగౌరవంగా జీవించాలన్నారు. రిటైర్డ్ తహశీల్దార్ సిరాజ్ మాట్లాడుతూ మహిళలు తమవంతుగా ఏదో ఒక నైపుణ్యాలను నేర్చుకొని వాటి ద్వారా ఆర్థికంగా బలపడాలని కోరారు. జెడి ఫౌండేషన్ కన్వీనర్ మాకినేని అరుణ మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి ఎంచుకొనే మార్గంలో కుట్టు శిక్షణ ఒక మంచి మార్గం అని దాని ద్వారా ఆర్థికంగా బలపడటం అనేది తన కుటుంబమే కాకుండా అనేకమంది మహిళలకు స్ఫూర్తిగా ఉంటుందన్నారు. జెడి ఫౌండేషన్ సభ్యురాలు పార్వతి శంకర్ మాట్లాడుతూ మహిళలు పురుషుల కంటే ఎక్కువ మేధాశక్తి ఉంటుందని అందువలనే వాళ్లలో సహజంగా నైపుణ్యాలు ఉంటాయని వాటి ద్వారా స్వయం ఉపాధి పొందవచ్చన్నారు. మీకోసం స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు దిలీప్‌కుమార్ రాయపాటి మాట్లాడుతూ మహిళలు స్వయంగా ఆర్థికంగా ఎదగడానికి చేయూతను ఉపయోగపడుతుందని అందులో టైలరింగ్ అనేది ప్రముఖ భూమికను పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో టైలరింగ్ నేర్చుకోవడంలో ఆసక్తి ఉన్న మహిళలు, కాలనీవాసులు తదితరులున్నారు.

దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని చిలకపాడు సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు బుధవారం స్థానిక గ్రామ సర్పంచ్ సిద్దారెడ్డి రమాదేవి, జెసిఎస్ మండల కన్వీనర్ సిద్దారెడ్డి మోహన్ రెడ్డి దుస్తులు, స్వీట్ బాక్సులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిసంవత్సరం సంక్రాంతి పండుగ సందర్భంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు దుస్తులు పంపిణీ చేయడమన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్ల పనితీరు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని చిలకపాడు గ్రామంలోని దేవాలయ పరిసర ప్రాంతాలలో యువతతో కలసి సర్పంచ్ సిద్దారెడ్డి రమాదేవి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను సంరక్షించి అవి వృక్షాలు అయ్యే వరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. పరిసరాల పచ్చదనంతో ప్రజల జీవనం ఆరోగ్యకరంగా, ఆనందకరంగా ఉంటుందన్నారు. ప్రతి సంక్రాంతి పండుగరోజున ఒక్కొక్కరు 20మొక్కలు నాటుతామని యువత తెలియజేశారు. కొత్తపల్లి లక్ష్మయ్య, సింగిరెడ్డి రమణారెడ్డి, కిరణ్, నారాయణరెడ్డి, షేక్ అన్వర్, రియాజ్ పాల్గొన్నారు.

నేడు ఎన్‌టిఆర్ వర్ధంతి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : స్థానిక మున్సిపల్ బస్టాండ్ సెంటర్ గురువారం ఉదయం 10 గంటలకు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు మాజీ ముఖ్యమంత్రి, శ్రీ పురుషుడు నందమూరి తారక రామారావు 28వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకులు తుమ్మల చంద్రారెడ్డి ప్రకటన ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు నియోజకవర్గం పార్టీ నాయకులతో పాటు కార్యకర్తలు, అభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వేడుకలకు హాజరైన వారందరికి మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ తరలి రావాలని ఆయన కోరారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు : వరికుంటపాడులో గురువారం జరిగే ఎన్‌టి రామారావు వర్ధంతి వేడుకలకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ చండ్ర మధుసూదన్ రావు పిలుపునిచ్చారు. అనంతరం ప్రభుత్వ కార్యాలయ సమీపంలో మాజీ ఎంఎల్ఎ బొల్లినేని రామారావు ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేస్తున్న టిడిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి ప్రతిఒక్కరూ హాజరు కావాలన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంఎల్ఎ కంభం విజయరామిరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చంచలబాబు యాదవ్ పాల్గొంటారన్నారు. ఆయనవెంట మాజీ మండల కన్వీనర్ చండ్ర వెంకయ్య, రాష్ట్ర యువత ముజ్జీ లక్ష్మీనారాయణ, బిసిసెల్ అధ్యక్షులు మానం కొండలరావు, ఎస్‌సిసెల్ శ్రీకాంత్ యాదవ్, అధ్యక్షులు తాతపూడి లాజర్, పేరం సుధాకర్‌రెడ్డి తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండల కేంద్రంలోని హైస్కూల్ రోడ్డు వీధికి చెందిన మల్లూరు శ్రీనివాసులు, ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అతని కుటుంబానికి వైఎస్‌ఆర్ ప్రమాద బీమా పథకం ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న మొదటి విడత రూ.10వేల నగదును బుధవారం బాధిత కుటుంబానికి సర్పంచ్ షేక్.తాజుద్దీన్ జిలానీ అందజేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ మహేంద్ర పాల్గొన్నారు.

'వికసిత్ భారత్ సంకల్పయాత్ర'

ప్రజాశక్తి-ఉదయగిరి : వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం ద్వారా పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఎంఇఒ-2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని గంగులవారి చెరువుపల్లి గ్రామంలో జరుగుతున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఎపిఎం ఖాజా రంతుల్లా, గంపాలెం వైద్య అధికారిణి శివ కల్పన, సర్పంచ్ గీత, హౌసింగ్ ఏఈ ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహం, స్మృతివనం ప్రారంభోత్సవానికి ఆత్మకూరు నియోజకవర్గం నుండి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని వైసిపి నాయకులు పేర్కొన్నారు. బుధవారం ఆత్మకూరులోని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలో కనీవిని ఎరుగని రీతిలో విజయవాడలోని స్వరాజ్ మైదానంలో 20 ఎకరాల్లో రూ.400 కోట్లతో 125 అడుగుల ఎత్తున డాక్టర్ అంబేద్కర్ విగ్రహాన్ని 19న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆవిష్కరిస్తారన్నారు. ఈ విగ్రహావిష్కరణలో ప్రతిఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, వైసిపి జిల్లా ఎస్‌సిసెల్ మాజీ అధ్యక్షుడు కొండా వెంకటేశ్వర్లు, ఎస్‌సి కన్వీనర్ డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్ షేక్ సర్దార్, డాక్టర్ కెవి శ్రావణ్ కుమార్, యువజన విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ అంకాల్ రాజశేఖర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నోటి వినయ్‌కుమార్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇందారం వెంకటరమణారెడ్డి, కౌన్సిలర్ హరికిషోర్ రెడ్డి తదితరులున్నారు.

ఆలయాల్లో చోరీలు

ప్రజాశక్తి-కొడవలూరు : ప్రముఖ ఆలయాలైన కొడవలూరు మండలం గండవరం ఉభయ కావేశ్వర స్వామి, గంగమ్మ గుడుల్లో దొంగలు పడ్డారు. రెండు ఆలయాలలోని హుండీలను పగలగొట్టి నగదును అపహరించుకుపోయారు. గంగమ్మ మంగళ సూత్రాన్ని చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని గండవరం ఆధ్యాత్మిక ప్రాంతంలో ఉన్న ఉభయ కావేశ్వరీ స్వామి ఆలయం, గంగమ్మ ఆలయాల్లో మంగళవారం రాత్రి దొంగలు పడ్డారు. రెండు ఆలయాల్లోని గ్రిల్ తాళం పగలగొట్టి లోనికి చొరబడ్డారు. ఉభయ కావేశ్వరీ స్వామి ఆలయంలోని ఉండిని అర కిలోమీటరు దూరంలో తీసుకెళ్లి పగలగొట్టి అందులోని నగదు తీసుకెళ్లారు. అనంతరం గంగమ్మ ఆలయంలో హుండీ పగలగొట్టి అమ్మవారి మెడలోని 20 గ్రాముల బంగారు మంగళసూత్రాలను కూడా అపహరించుకొని పోయారు. ఉదయం ఆలయ పూజారులు బుధవారం ఆలయంలోకి వచ్చి చోరీ జరిగినట్లు గుర్తించి ఆలయ ఇఒ బి.శాంతయ్యకు సమాచారం అందించగా ఆలయ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి వెళ్లి చోరీ జరిగిన వివరాలను పరిశీలించారు. గతేడాది బ్రహ్మోత్సవాల తరువాత ఆలయాలలో హుండీ లెక్కింపు జరిగిందని భక్తులు మాత్రం తరచూ ఆలయాలకు వస్తూనే ఉంటారు. దానిని బట్టి రెండు హుండీలలో కలిపి రూ.50వేల వరకు నగదు ఉండవచ్చని ప్రాథమిక అంచనా వేస్తున్నారు. సిసి కెమెరాల ఆధారంగా దర్యాప్తు ఆలయ ప్రాంతాలలో పోలీసులు సిసి కెమెరాలను ఏర్పాటు చేసి ఉన్నారు. చోరీ దర్యాప్తులో సిసి కెమెరాలు కీలకంగా మారాయి. ఇద్దరు ఆగంతకులు ఆలయాల్లోకి వెళ్లినట్లు సిసి ఫుటేజ్ ఆధారంగా తెలుస్తుంది. వీరు పాత నేరస్తులుగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఎస్ఐ కె.శివప్రకాశ్ తన దర్యాప్తు వేగవంతం చేశారు. సిసి కెమెరా ఫుటేజ్ ఆధారంగా త్వరలోనే నేరస్తులను అదుపులోకి తీసుకుంటామన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-మర్రిపాడు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007-08 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు 16 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఆనాడు పాఠశాలలో గడిపిన మధురస్మృతులను జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకొని ఆనందంగా గడిపారు. ఉన్నత చదువులను అభ్యసించి కొందరు ఉద్యోగాలలో, మరికొందరు వ్యాపారాలలో స్థిరపడ్డారు. గురువులతో పాటు విద్యార్థులు అప్పటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులు ప్రస్తుత చుంచులూరు ప్రధానోపాధ్యాయులు సుధాకర్, ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానంలో గౌరవాన్ని పొందినప్పుడే ఉపాధ్యాయులకు పూర్తి గుర్తింపు లభిస్తుందని, విద్యార్థులు తమ ఉన్నతిని తెలుపుతుంటే చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. గురువులు చూపించిన సన్మార్గంలో నడిచి ప్రస్తుతం ప్రతి విద్యార్థి వివిధ వృత్తుల్లో ప్రభుత్వ ఉద్యోగాల్లో కొనసాగుతూ ఆనంద జీవితాన్ని గడుపుతున్నట్టు పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత స్థానంలో ఉండడం చాలా సంతోషంగా ఉందని వారు తెలియజేశారు. విద్యార్థుల ప్రేమకు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు. అనంతరం విద్యార్థులు గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : కావలి స్నేహ జూనియర్ కళాశాల 2014-2016 సంవత్సర ఇంటర్ మీడియట్ విద్యార్థులు బోగోలు మండలం తడనూతుల గ్రామంలో భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణకేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం బుధవారం నిర్వహించారు. విద్యార్థినీ, విధ్యార్థులు ఆప్యాయంగా ఒకరికొకరు పలకరించుకొని ఆనాటి జ్ఞాపకాలను పంచుకొని ఆనందంగా గడిపారు. ఆదరణ కేంద్రంలోని పిల్లలకు నిత్యావసర వస్తువులు, స్వీట్సు అందజేశారు. ఈ సందర్భంగా ఆదరణ కేంద్రం డైరక్టర్ కట్టిపల్లి సింహాద్రిరావు మాట్లాడుతూ పూర్వవిద్యార్థుల కలయిక ఆదరణకేంద్రంలో ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. సంధ్య, భువన, మహిత, మురళి, గౌస్, మహేష్, హఫీస్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

మాట్లాడుతున్న ఇఒపిఆర్‌డి మల్లికార్జున

31లోగా తీర్మానాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

గ్రామాల అభివృద్ధి ప్రణాళికలపై ఉదయగిరి స్త్రీశక్తి భవనంలో ఇఒపిఆర్‌డి మల్లికార్జున, సర్పంచులు సంబంధిత అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 17 పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు గ్రామాల అభివృద్ధికి అవసరమైన తీర్మానాలు పూర్తి చేయాలన్నారు. ప్రతి పంచాయతీకి సంబంధిత వివరాలను జనవరి 31వ తేదీ లోపు ఎంపిడిఒ కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. తీర్మానం చేసిన పనులకు మాత్రమే నిధులు మంజూరు అవుతాయని తెలిపారు. పంచాయతీల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహరించాలన్నారు. ముందుగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గాంధీజీ చిత్రపటాలకు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఒ సిహెచ్ రేణుక, ఆరోగ్య సిబ్బంది, సర్పంచులు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : గ్రామపంచాయతీలో 2024-25 సంవత్సరానికి అవసరమైన పనుల గుర్తింపు సక్రమంగా నిర్వహించి ముందస్తు బడ్జెట్ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపిపి పద్మజారెడ్డి తెలిపారు. ఎఎస్‌పేట మండల పరిషత్ కార్యాలయంలో జిపిడిపి పంచాయతీ ముందస్తు ప్రణాళికరాలపై అవగాహన సమావేశం ఎంపిడిఒ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులకు కార్యదర్శులకు పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక గురించి తెలియజేశారు. ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో పనిచేసే ప్రణాళిక తయారు చేయాలని తెలిపారు. రెండవ గ్రామసభ ద్వారా అవసరమైన పనులు గుర్తించి నమోదు చేయాలన్నారు. ముందస్తు గ్రామ బడ్జెట్ ప్రణాళిక తయారుకు ఈ పనులు నమోదు అవసరమన్నారు. శిక్షకులుగా కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఇఒపిఆర్‌డి ఎస్థాని భాషా, కార్యదర్శి భరత్, ఎంసిఎ ప్రసన్నకుమారి వివరాలు తెలియజేశారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : గ్రామ పంచాయతీల్లో ప్రణాళికాబద్ధమైన కార్యాచరణతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపిడిఒ పి.ఐజాక్ ప్రవీణ్ పేర్కొన్నారు. ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళికలు-2024-2025 సంబంధించిన శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ఎంపిడిఒ పి.ఐజాక్ ప్రవీణ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయితీల్లో ప్రణాళికాబద్ధమైన కార్యాచరణతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని సూచించారు. ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేసి గ్రామ పంచాయతీలకు వస్తున్న నిధులు, గ్రామ పంచాయతీల ఆదాయ వనరులను కలుపుకొని చేపట్టాల్సిన పనులను రూపొందించుకోవాలని తెలిపారు. జిపిడిపి (గ్రామ పంచాయతీ డెవలప్ మెంట్ ప్లాన్) ప్రాముఖ్యత, ఆవశ్యకతను వివరించారు. తదుపరి ఇఒపిఆర్‌డి టి.ఉషారాణి జిపిడిపిలో సర్పంచులు, కార్యదర్శులు పాత్రను వివరించారు. ట్రైనర్ శ్రీను, వేణు హాజరైన సర్పంచులకు, పంచాయితీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు జిపిడిపిపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలోని పంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-ఉదయగిరి

ఆత్మకూరు ఆర్‌డిఒ కార్యాలయంలో ఉదయగిరి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు 19వ తేదీ ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సిడిపిఒ పచ్చవ లావణ్య తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఉదయగిరి మండలంలోని గుడినరవ వర్కర్ జిచెర్లోపల్లి, ఉదయగిరి హెచ్‌ఆర్ హెల్పర్, సీతారామపురం మండలంలోని గంధంవారిపల్లి వర్కర్, బసినేనిపల్లి మెయిన్ హెల్పర్, అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న ఖాళీలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆత్మకూరు ఆర్‌డిఒ కార్యాలయానికి సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆమె కోరారు.

20న ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని జవహర్ నవోదయ విద్యాలయం కృష్ణాపురంలో 2024-25 విద్యా సంవత్సరంలో 20న జరుగనున్న 6వ తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయని నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ ఎస్.శ్రీనివాసరావు తెలియజేశారు. 6వ తరగతిలో 80సీట్లు ఉండగా జిల్లా నుండి 4635మంది విద్యార్థులు పోటీ పడుతున్నారు. జిల్లాలో ఈ ప్రవేశ పరీక్ష 21 కేంద్రాలలో ఉదయం 11:30 నుండి 1.30వరకు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ప్రవేశ పరీక్ష హాల్ టికెట్లను నవోదయ వెబ్‌సైట్ W.W.W.navodaya.nic.in పొందవచ్చన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్, ఏదైనా గుర్తింపు కార్డు తమవెంట తీసుకురావాలన్నారు. పరీక్ష కేంద్రానికి గంట ముందే రావాలని, వచ్చిన విద్యార్థులకు అనుమతి లేదన్నారు. సందేహాలు, సలహాల కోసం హెల్ప్‌లైన్ 8985007588, 8106898817, 9493514644 నెంబర్లను సంప్రదించాలన్నారు.

మానసిక వికాసానికి క్రీడలు అవసరం

ప్రజాశక్తి-బిట్రగుంట

పిల్లల మానసిక వికాసానికి క్రీడలు చాలా అవసరమని విశ్వనాథరావుపేట సర్పంచ్ గండూరి మంజుల పేర్కొన్నారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేటలో సంక్రాంతి పండుగ సందర్భంగా యంగ్‌లైన్స్ కమిటీ వారి ఆధ్వర్యంలో పిల్లలకు, పెద్దలకు ఆటల పోటీలను మూడు రోజులు పాటు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ గండూరి మంజుల, రైల్వే సిటిఐ విశ్రాంతి ఉద్యోగి రామయ్య, రైల్వే బుకింగ్ విశ్రాంతి ఉద్యోగి చీఫ్ సత్యం, గండూరి శ్రీనివాసులు, కాంట్రాక్టర్ సిహెచ్ కృష్ణ పాల్గొని గెలుపొందిన వారికి బహుమతులను అందజేసి వారు మాట్లాడారు. విశ్వనాథరావుపేటలో యంగ్ లైన్స్ కమిటీ 1969 స్థాపించినప్పటి నుండి సంక్రాంతి పండుగ రోజున పిల్లలకు పెద్దలకు ఫుట్బాల్ క్రికెట్ క్రీడలను జరుపుతున్నారని, పండుగ అంటే యంగ్లైన్స్ కమిటీ వారు నిర్వహించే ఆటల పోటీలే అని, బిట్రగుంటలో పుట్టి సుధీర ప్రాంతాలలో ఉద్యోగ వెళ్లి స్థిరపడి వారు ప్రతి సంవత్సరం సంక్రాంతికి పండుగ రోజున బిట్రగుంటకు వచ్చి ఆటల పోటీలలో పాల్గొనడం బిట్రగుంట ప్రాంత ప్రజలకు ఎంతో ఆనందంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో యంగ్ లైన్స్ కమిటీ సభ్యులు పెండ్లి వెంకటేశ్వర్లు, పాశం సాగర్, పెండ్లి రాజేష్, పేట శ్రీధర్, సుబ్బారావు, మాల్యాద్రి, యంగ్ లైన్స్ కమిటీ, సభ్యులు, గ్రామస్తులు, యువకులు, పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేతకు నగదు అందజేత

ప్రజాశక్తి-మర్రిపాడు : సంక్రాంతి సందర్భంగా మండలంలోని చినమాచనూరులో చంద్ర మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను పంచాయతీ వ్యాప్తంగా నిర్వాహకులు ఐ.వెంకటరెడ్డి, బి.సుధాకర్ రెడ్డి, ఎం.రామచంద్రా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వాహించారు. ఈ టోర్నమెంట్‌లో స్థానిక, బయట మండలాల నుండి 15టీములు పాల్గొనగా ఫైనల్ మ్యాచ్‌లో చిన్నమాచనూరు పంచాయతీ టీమ్ గెలుపొందింది. విజేత జట్టుకు రూ.15వేలు నగదు, కప్‌ను, రన్నర్‌కు రూ.10వేలను అందజేశారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : ఎఎస్‌పేటలోని దర్గా సెంటర్ యువకులు బుధవారం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎఎస్‌పేట ఎస్ఐ నరేష్, ఎఎస్‌పేట మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ సంధాని బాషా, ఎఎస్‌పేట సర్పంచ్ షేక్ జిలానీ బాషా, మైనారిటీ నాయకులు షేక్.షకీల్ తదితరులు పాల్గొనీ ఎస్ఐ నరేష్ చేతుల మీదుగా రిబ్బన్ కటింగ్ చేసి టోర్నమెంట్ తొలి దశను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువకులు కలిసి మెలసి ఉండాలని, క్రీడల వల్ల యువకులు ఆరోగ్యవంతంగా ఉంటారని, యువకులకు విద్యతోపాటు క్రీడలు కూడా ఆరోగ్యానికి చాలా అవసరమని వారు తెలిపారు. టోర్నమెంట్లో పాల్గొనే యువకులకు కార్యనిర్వాహక సభ్యులు మంచినీటి వసతి కూర్చునేందుకు ఏర్పాట్లు టోర్నమెంట్ పూర్తయ్యే వరకు చక్కగా ఏర్పాటు చేయాలని కోరారు. టోర్నమెంట్ పూర్తయిన తర్వాత బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమం ఉంటుందని మొదటి బహుమతిగా రూ.30116, రెండవ బహుమతి రూ.20116, మూడవ బహుమతి రూ.10116 నాయకుల సహకారంతో ఇస్తామని కార్యనిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : క్రీడలతో మానసిక ఉల్లాసం చేకూరుతుందని బిఎస్‌ఆర్ హాస్పిటల్ అధినేత్రి డాక్టర్ షకీలా పేర్కొన్నారు. బుధవారం ఆత్మకూరు పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్ ప్రాంగణలో గత 4 రోజులుగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి ఆటల పోటీలు బుధవారంతో క్రీడలు ముగిశాయి. ఈ క్రీడలలో క్రికెట్ విన్నర్ టీమ్ 11 ఇడియట్స్ క్రికెట్ రన్నర్స్ టీమ్ 11హార్స్, ఫుట్‌బాల్ విన్నర్స్ టీమ్ ఫుట్‌బాల్ క్లబ్ సీనియర్స్ టీమ్, ఆత్మకూరు ఫుట్‌బాల్ క్లబ్ జూనియర్స్‌గా నిలిచారు. వాలీబాల్ విన్నర్స్ అరుంధతీయపాలెం, రన్నర్ సిటీ బట్టేపాడు కైవసం చేసుకున్నారు. షటిల్ విన్నర్ టీమ్ ఉదయ భాస్కర్ కృష్ణ టీమ్ రన్నర్స్ టీమ్ శివఅశోక్ నిలవగా థర్డ్‌ప్లేస్ సుబ్బు హిమాన్‌గా నిలిచారు. అనంతరం బహుమతుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు జి వి శివప్రసాద్, జిల్లా కౌలు రైతు సంఘం ఉపాధ్యక్షులు గంటల లక్ష్మీపతి, సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, జనవిజ్ఞాన వేదిక నాయకులు హరికృష్ణ, విశ్రాంతి ఉపాధ్యాయులు సాదిక్ హుస్సేన్, సిపిఎం నాయకులు ఆళ్ల హజరత్తయ్య, డివైఎఫ్ఐ నాయకులు నంద శీను, రిచ్చర్డ్, జిలాని పాల్గొన్నారు.

దావా సామను
Order 5 R 1 & 5 C.P.C.
మహారాజశ్రీ కందుకూరు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 353 / 2022
తల్లపునేని శివ కృష్ణ - వాది
Vs
ఏకాంబరం మహేష్ బాబు - ప్రతివాది

To,
ఏకాంబరం మహేష్ బాబు, తండ్రి **నరసింహా రావు,** గ్రామ సచివాలయ ఉద్యోగి, నాంచారమ్మ కాలనీ, 4వ వీధి, కందుకూరు మునిసిపాలిటీ, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వారికి.

పై నంబరు దావాలో బాకీ సొమ్ము రాబట్టుకొను నిమిత్తము మీపై దావా వేసి ఉన్నారు. మీకు కోర్టు ద్వారానూ మరియు పోస్టు ద్వారానూ దావా సమన్లు పంపినప్పటికీ మీరు తీసుకొనక ఏదో ఒక కారణముతో చేరుటలేదు. కావున **తే 01-02-2024 ది ఉదయం గం॥ 10.30 నిముషములకు** మీరు స్వతహాగా గానీ, సంపూర్ణ సంజాయిషీ పొందిన అన్ని ప్రశ్నలకు సమాధానము చెప్పకూడిన ప్లీడర్ గారి ద్వారా పై కోర్టు వారి ఎదుట హాజరై మీ యొక్క సంజాయిషీ తెలుపుకోవలసినదిగా నిన్ను ఆదేశించడమైనది. మీరు హాజరు కాకుండా తప్పినయెడల మీ పరోక్షమున ఈ వాజ్యమును విమర్శ చేసి తీర్మానించ తగునని ఇందుమూలముగా తెలియపరచడమైనది.

వాయిదా తేది: 01-02-2024
(పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
పెట్లూరి రామకృష్ణ మురళి
వాది తరపు న్యాయవాది,
కందుకూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.